కంకర తేలిన రోడ్డును పరిశీలిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

రోడ్ల నిర్మాణాలను అడ్డుకోవడం హేయం

- కంకర రోడ్లతో ప్రజల నరకయాతన
- కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ హయాంలో మారుమూల గ్రామాలు, తండాలకు మంజూరు చేయించిన రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అడ్డుకోవడం హేయమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారావుపేట నుంచి పగడాల వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పెద్ది పరిశీలించారు. కేసీఆర్ సర్కారు హయాంలో తాను తండాలు, మారుమూల గ్రామాలకు బీటీరోడ్లు, పాకాల, మున్నేరువాగుపై బ్రిడ్జిలు మంజూరు చేయించానని గుర్తు చేశారు. కంకర పనులు కూడా పూర్తయినట్లు తెలిపారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పనులను అర్ధంతరంగా నిలిపివేయించి, అవే నిధులను సొంత కాంట్రాక్ట్ పనులకు వాడుకుంటున్నాడని ఆరోపించారు. దీంతో నియోజకవర్గంలో 100 కి.మీ మేర రోడ్ల పనులు నిలిచిపోయాయని చెప్పారు. కంకర తేలిన రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని సుదర్శన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు

ప్రజాస్వామ్యంలో ఇది సరైన విధానం కాదని పెద్ది హితవు పలికారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడిగేందుకు వస్తారని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. గ్రామాలకు వచ్చే అధికార పార్టీ నేతలను ప్రజలు నిలదీయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో తట్టెడు మట్టి తీసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా స్వార్థపూరిత రాజకీయాలను పక్కనబెట్టి నర్సంపేట నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, మాజీ ఎంపీపీ వీ ప్రకాశ్ రావు, మాజీ జడ్పీటీసీ బత్తిని స్వప్న, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామీనాయక్, కుమారస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పెద్ది పరామర్శ

చెన్నారావుపేట: ఇటీవల మండలంలో మరణించిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మండలకేంద్రంలోని గట్ల నర్సయ్య, పాతముగ్దంపురం గ్రామానికి చెందిన నాంపెల్లి కృష్ణవేణి మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను పెద్ది పరామర్శించారు. ఆయన వెంట అమీనాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మురహరి రవి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బాల్నె వెంకన్న, కుండె మల్లయ్య, ఎండీ రఫీ, జున్నుతుల మహేందర్‌రెడ్డి, అమ్మ రాజేశ్, కందకట్ల సాంబయ్య, గట్ల కృష్ణయ్య, పోలపల్లి రమేశ్, నాంపెల్లి మల్లయ్య, బషీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

యువత రాజకీయ రంగంలో రాణించాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 2: యువకులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకొని రాజకీయ రంగంలో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు సెల్‌ఫోన్లు, సినిమాలు, ఇతర విషయాలపై దృష్టి సారిస్తూ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. ఖాళీ సమయంలో యువకులు క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యవంతులుగా తయారవుతారని చెప్పారు. ప్రధానంగా యువకులు గ్రామీణ సమస్యలపై అవగాహన పెంచుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటూ గ్రామీణ ప్రజలతో మమేకమై రాజకీయ రంగంలో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పార్టీ నాయకులు సిలువేరు కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్, పునుగోటి చందర్‌రావు, మరుపట్ల వేణు, తూళ్ల శివ, ఎల్లయ్య, శ్రీధర్, సురేశ్ డానియెల్, రాములు, నాగరాజు, శ్యామ్‌బాబు, వెంకటేశ్, రాజేశ్, నవీన్, భాస్కర్, సుమన్, గణేశ్, అరూరి నరేందర్, రమేశ్ పాల్గొన్నారు.

'ప్రైవేట్ అధ్యాపకులకు డ్యూటీలు కేటాయించాలి'

గిర్మాజీపేట, ఫిబ్రవరి 2: ప్రైవేట్ కళాశాలల్లో విధులు నిర్వర్తించే అధ్యాపకులకు ఇంటర్ ప్రాక్టికల్స్ ఎగ్జామినర్ డ్యూటీలు కేటాయించాలని, లేకపోతే వార్షిక పరీక్షల మూల్యాంకనం విధులకు హాజరు కాబోమని ప్రైవేట్ లెక్చరర్ అసోసియేషన్ బాధ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు ఓవైపు చెబుతున్నా.. ఆదివారం సాయంత్రం వరకు పరీక్షల ఎగ్జామినర్ల వివరాలు సంబంధిత కళాశాలల లాగిన్‌లో చూపించకపోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ప్రయోగ పరీక్షలకు ఎగ్జామినర్ డ్యూటీలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకే అలాట్ చేసినట్లు సమాచారం. నాలుగు సెషన్లలో నిర్వహించనున్న ప్రయోగ పరీక్షలకు మొత్తం ప్రభుత్వ అధ్యాపకులకే రెండు, మూడు స్పెల్స్ కేటాయించడం విస్మయం కలిగిస్తున్నది. ప్రైవేట్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు ఈసారి ఎగ్జామినర్ డ్యూటీలను అలాట్ చేయకపోవడంతో ప్రైవేట్ లెక్చరర్ అసోసియేషన్ సభ్యులు, ప్రైవేట్ అధ్యాపకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ఇంటర్ వార్షిక మూల్యాంకనానికి మేమెలా వెళ్తామని అభ్యంతరం తెలిపారు. డీఐఈవో శ్రీధర్‌సుమన్‌ను వివరణ కోరగా.. ఇది ఇంటర్ బోర్డు నిర్ణయమని బదులిచ్చారు. కాగా, గత ఇంటర్ ప్రాక్టికల్స్ మూడో సెషన్‌లో విధులు నిర్వర్తించిన అధ్యాపకులకు ఏడాది గడస్తున్నా నేటికీ డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తం

- మెనూ పాటించని నిర్వాహకులు
- పరిశుభ్రత దేవుడెరుగు
- ప్రిన్సిపాళ్లు, సిబ్బంది ఇష్టారాజ్యం
- కలెక్టర్ తనిఖీలతో వెలుగులోకి..
- ఇద్దరు ప్రిన్సిపాళ్ల తోపాటు సిబ్బందికి షోకాజ్ నోటీసుల జారీ

నెక్కొండ బాలుర పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యశారద

నెక్కొండ, ఫిబ్రవరి 2: సంక్షేమ వసతి గృహాల్లో విధిగా మెనూ పాటించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. నెక్కొండలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల, బాలుర పోస్టు మెట్రిక్ హాస్టల్, బాలికల పోస్టు మెట్రిక్ హాస్టల్, పెద్దకోర్పోలులోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ పాటించని నెక్కొండలోని తెలంగాణ గురుకుల, కళాశాల ప్రిన్సిపాల్ మమత, పెద్దకోర్పోలులోని కేజీబీవీ ప్రిన్సిపాల్ రజితకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విచారణ జరిపి నివేదిక అందించాలని డీఈవోను ఆదేశించారు. లోపాలు వెల్లడైతే ఇద్దరిని సస్పెండ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని వంట గదులు, డైనింగ్ హాళ్లు, స్టోర్ రూముల్లో భద్రపరిచిన సరుకులను పరిశీలించారు. బాలుర పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థులతో నేలపై కూర్చొని భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు.

మటన్‌కు బదులు చికెన్

తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో కొత్త మెనూ ప్రకారం ఆదివారం విద్యార్థులకు మటన్‌తో భోజనం పెట్టాల్సి ఉండగా చికెన్ వడ్డించారు. గురుకులంలో స్టాక్ రిజిస్టర్లలో లోపాలతోపాటు విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మెనూ అందడం లేదని గుర్తించారు. అలాగే, స్టాక్ రిజిస్టర్‌లో ఖాళీలను గుర్తించి అవకతవకలు ఏంటని ప్రశ్నించారు. అకౌంటెంట్ పనితీరుపై మండిపడ్డారు. ఇష్టారీతిన మెనూ ఎలా అమలు చేస్తున్నారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ మెనూ పాటించడం లేదని, అందుబాటులో లేకపోవడంపై మండిపడుతూ అతడిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పెద్దకోర్పోలు కేజీబీవీలో విద్యార్థులకు ఆదివారం మటన్ వండి పెట్టలేదన్నారు. సప్లయర్ ఆలస్యంగా మటన్ తెచ్చాడని ఇన్‌చార్జి చెప్పడంతో కలెక్టర్ మండిపడ్డారు. గురుకులంలోని స్టోర్ రూముల్లో బియ్యాన్ని నేలపై పెట్టడంతో పురుగులు పట్టినట్లు గుర్తించారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం

సరుకులు భద్రపరిచే గది అపరిశుభ్రంగా ఉందని, క్రిమికీటకాలకు నిలయంగా మారిందని, వెంటనే పరిస్థితిని చక్కదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. కేజీబీవీ నిర్వహణలో లోపాలపై, నిర్దేశించిన మెనూ పాటించనందుకు ప్రిన్సిపాల్ రజితకు షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పీఈటీ సమ్మక్క ఆటవస్తువులు వినియోగించపోవడం, విద్యార్థులతో ఆవరణలోని గడ్డిని తొలగింపజేస్తుండడం, ఆటల నిర్వహణపై దృష్టి సారించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో గదులను శుభ్రం చేయిస్తున్నట్లు గుర్తించి మండలించారు. అన్ని వసతి గృహాల్లోని ఫిర్యాదుల పెట్టెలను పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థులు పలు సమస్యలను రాసి పెట్టెల్లో వేయగా, పరిశీలించి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై మహేందర్ ఉన్నారు.

అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు

వసతి గృహాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేజీబీవీలో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రిన్సిపాల్ (ప్రత్యేక అధికారి)కు, సాంఘిక శాస్త్రం టీచర్‌కు, పీఈటీకి షోకాజ్ నోటీసులు అందించారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహణలోపాలపై ప్రిన్సిపాల్‌కు, రిజిస్టర్లు సక్రమంగా లేకపోవడంతో అకౌంటెంట్, వార్డెన్‌కు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏటీపీకి షోకాజ్ నోటీసులు అందించారు.

పెద్దకోర్పోలు కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కార్మిక వర్గానికి మొండి చేయి

యువరాజ్

నర్సంపేట, ఫిబ్రవరి 2: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వర్గానికి మొండి చేయి చూపించిందని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ ఒక ప్రకటనలో విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకొచ్చేందుకు అనేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసిన తరుణంలో ఆదిశగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లకు ఊతం ఇచ్చేలా కార్పొరేట్ శక్తులకు మరోసారి మోదీ ప్రభుత్వం అండగా నిలిచిందని దుయ్యబట్టారు. ఉద్యోగ, కార్మికులు కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

'వ్యవసాయాన్ని విస్మరించిన కేంద్రం'

నర్సంపేట, ఫిబ్రవరి 2: వ్యవసాయ రంగాన్ని కేంద్రం విస్మరించిందని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి అన్నారు. మాదన్నపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను నిరాశపర్చిందన్నారు. తెలంగాణకు నిధులు రాబట్టడంలో ఎంపీలు ఘోర వైఫల్యం చెందారని విమర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కర్నె సాంబయ్య, పార్టీ గ్రామ కార్యదర్శి అనుమాల రమేశ్, గుర్రం రవి, ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

బాధితుల ఖాతాల్లో నగదు జమ

కరీమాబాద్, ఫిబ్రవరి 2: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఘటనా స్థలంలో దొరికిన నగదు అందజేశారు. వరంగల్ నగరానికి వలస వచ్చిన మధ్యప్రదేశ్ కూలీలు ఇటీవల మామునూరు రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఘటనా స్థలంలో కూలీల సామగ్రిని పోలీసులు పరిశీలించగా, అందులో లక్ష రూపాయలకు పైగా నగదు లభించింది. దీంతో ప్రమాదంలో గాయపడి మధ్యప్రదేశ్‌లోని స్వగ్రామాలకు వెళ్లిన చమాభాయ్, ముకేశ్ బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని 1.15 లక్షల నగదు జమ చేశారు. పోలీసుల నిజాయితీని ప్రజలు ప్రశంసించారు.

మహిళ అదృశ్యం

సమత

కరీమాబాద్, ఫిబ్రవరి 2: మామునూరు పరిధిలోని జక్కలొద్దికి చెందిన పోలు సమత ఈ నెల 1 నుంచి కన్పించకుండా పోయిందని మామునూరు పోలీసులు తెలిపారు. మహిళకు మతిస్థిమితం సరిగా లేదని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712685439, 87126 85253 నంబర్లలో తెలియజేయాలని సూచించారు.

దారి ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

సంగెం, ఫిబ్రవరి 2: పంట పొలాలకు వెళ్లే దారిని ఆక్రమించి కనీలు నాటిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులు తమ పంట పొలాలకు వెళ్లకుండా లోహిత గ్రామానికి చెందిన చెరుకు రాజు ఈ నెల 1న కనీలు నాటాడు. రాజు గతేడాది కూడా కనీలు నాటితే స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అధికారులు కనీలను తొలగించారు. మళ్లీ కనీలు నాటి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని 40 మంది రైతులు తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా నర్సంపేట

- హడావిడిగా గెజిట్ విడుదల
- విలీనం నుంచి రాజుపేటకు ఊరట

నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయం

నర్సంపేట, ఫిబ్రవరి 2: గ్రేడ్-2 మున్సిపాలిటీగా నర్సంపేట అవతరించింది. ప్రభుత్వం హడావిడిగా గెజిట్ విడుదల చేసింది. అయితే, విలీన గ్రామాల్లో రాజుపేటకు ఊరట లభించింది. వివరాల్లోకి వెళ్తే.. గతంలో నర్సంపేట మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. తర్వాత నగర పంచాయతీగా, అనంతరం 24 వార్డులతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణంలో 44 వేల జనాభా ఉంది. విలీన గ్రామాల జనాభా సుమారు 15 వేలకు పైచిలుకు ఉంది. మొత్తంగా మున్సిపాలిటీ పరిధి సుమారు 60 వేల జనాభా కలిగి ఉంది. నర్సంపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రాజుపేట ఏజెన్సీ గ్రామం. 1/70 పీసా చట్టం పరిధిలోని రాజుపేట విలీనానికి సాంకేతిక అడ్డంకులు ఎదురైనట్లు తెలుస్తోంది. విలీనాన్ని వ్యతిరేకిస్తూ గ్రామానికి చెందిన గిరిజనులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో రాజుపేటను నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేయకుండా వదిలేశారు.

'కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం'

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 2: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటి పాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత పట్టు, కలంకారి, చేనేత చీరెలు ధరించి బడ్జెట్లను ప్రవేశపెడుతున్న సీతారామన్ నేతన్నల సంక్షేమాన్ని విస్మరించడం దారుణమన్నారు. పదేళ్లుగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా, చేనేతను నిర్మూలించే విధానాలను అనుసరించడంతో దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పథకాలను రద్దు చేయడం వల్ల నేత పరిశ్రమ అపంశయ్యపై ఉందన్నారు. దీంతో నేత కార్మికులకు చేతినిండా పని లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి ఐదు వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని, నూలుపై 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని, వర్క్‌షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

ఇద్దరు యువకులపై కేసు నమోదు

నెక్కొండ, జనవరి 2: గొడవను ఆపేందుకు వెళ్లిన పోలీసులపై మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు దాడి చేసిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. నెక్కొండ ఎస్‌బీఐ సమీపంలో కూరగాయల దుకాణం ఎదుట సాయిరెడ్డిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ రాపాక ధనమంత్రిను ఆపి అతడిపై దుగ్గొండి మండలం నాచనపల్లికి చెందిన బెట్టి రాజు, నెక్కొండకు చెందిన ఉల్లెరావు ప్రణీత్ చేయిచేసుకొని గొడవకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు గొడవ చేస్తున్నారని స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు.

వెంటనే కానిస్టేబుల్ అక్షయ్, హోంగార్డు చిమ్మనాయక్ ఘటనా స్థలానికి వెళ్లి గొడవను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో ఆ ఇద్దరు యువకులు పోలీసు విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

పర్వతగిరి, ఫిబ్రవరి 2: మండలకేంద్రానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చీదురు కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్‌గౌడ్‌తోపాటు డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కిష్టయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రీడా సామగ్రి అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా

యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 2: మండలంలోని కొత్తపల్లికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేశ్‌ఖన్నా ఆదివారం గ్రామానికి చెందిన యువకులకు క్రీడా సామగ్రి అందజేశారు. యువకులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడా సామగ్రి అందించినట్లు చెప్పారు. యువకులు సెల్‌ఫోన్లతో సమాయాన్ని వృథా చేసుకోకుండా క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

డ్రైనేజీలు కంపు కంపు

చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

గిర్మాజీపేట, ఫిబ్రవరి 2: నగరంలోని డ్రైనేజీలు చెత్తాచెదారం పేరుకుపోయి కంపు కొడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ 33వ డివిజన్ హనుమాన్‌నగర్‌లో డ్రైనేజీలను నెలల తరబడి శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలు మురుగునీరు, వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య కార్మికులు చాలాచోట్ల ప్రధాన వీధుల్లో మాత్రమే డ్రైనేజీలను శుభ్రం చేసి.. కాలనీల్లో పట్టించుకోవడం లేదని, తద్వారా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ కార్పొరేటర్ చొరవ చూపి డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వారు.. మరమ్మతులు మరిచారు..

2 నెలలుగా స్థానిక ప్రజల ఇబ్బందులు

కరీమాబాద్, ఫిబ్రవరి 2: వరంగల్ నగరంలోని పెరుకవాడలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. అందులో నుంచి మురుగునీరు ప్రవహించకపోవడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జీడబ్ల్యూఎంసీ సిబ్బంది జేసీబీతో రోడ్డు మధ్యలో తవ్వి మురుగునీరు పారేలా చర్యలు చేపట్టారు. సుమారు రెండు నెలలు కావొస్తున్నా సిబ్బంది రోడ్డుకు మరమ్మతులు చేయడం మరిచారు. దీంతో రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

పెరుకవాడలోని బొడ్రాయి వద్ద మురుగునీరు పారేందుకు రోడ్డు మధ్యలో తీసిన గుంత

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

'కొత్త పొద్దు కోసం' కవితా సంపుటి ఆవిష్కరణ

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 2: ప్రముఖ కవయిత్రీ, ఉపాధ్యాయురాలు గట్టు రాధికా మోహన్ రచించిన 'కొత్త పొద్దు కోసం' కవితా సంపుటిలో సమాజంలోని సమకాలిన సమస్యలు ప్రతిధ్వనించాయని ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఆదివారం 'కొత్త పొద్దు కోసం' కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవి యాకూబ్, కవి పెనుగొండ సరసిజ, వీఆర్ విద్యార్థి, నెల్లుట్ల రమాదేవి, బిల్ల మహేందర్, పుప్పాల శ్రీరాం, గట్టు నవీన్‌కుమార్, కోడం కుమారస్వామి, అస్నాల శ్రీనివాస్, యోచన్, బండారి రాజ్‌కుమార్, కార్తీక రాజు, రామా రత్నమాల, కల్యాణి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

లక్నేపల్లిలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

నర్సంపేట, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7న జరగనున్న లక్షల డప్పులు.. వేల గొంతులు చలో హైదరాబాద్ మహాసభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కళ్లెపల్లి ప్రణయ్‌దీప్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లక్నేపల్లిలో ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొడారి రవన్న, తడుగుల విజయ్, బారపాక మొగిలి, ఆరెపల్లి రాజేందర్, బారపాక భాస్కర్, కొడారి రజాక్, శనిగరం సురేష్, కొడారి కుమార్, జన్ను ఐలయ్య, మంద తిరుపతి, బీ ప్రభాకర్, నవీన్, సాంబయ్య, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అశోక్‌కుమార్

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 2: వరంగల్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. వాసవీకాలనీలోని ఇన్నర్‌వీల్ కమ్యూనిటీ